




గేటుపై భాగంలో పూర్తిగా ఎండిపోయిన కాలువ



రాజుపేట సమీపంలో సీఎం జగన్ బటన్ నొక్కిన హంద్రీ-నీవా కాలువ గేటు వద్ద ఇదీ పరిస్థితి



మిట్టపల్లె మద్దికుంట సమీపంలో నెర్రెలు బారిన కాలువ

జగనన్న జల నాటకం!

ఫిబ్రవరి 26.. రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ నీవా కాలువపై బటన్ నొక్కారు. కాలువలోకి నీళ్లు వదిలారు. చంద్రబాబు నియోజకవర్గానికి కృష్ణా జలాలు ఇచ్చేశామని చెప్పారు. కానీ, రెండో రోజునుంచే నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది.

మార్చి 15.. గేటు పైభాగంలో కాలువ పూర్తిగా ఎండిపోయింది. పలుచోట్ల నెర్రెలిచ్చి ఉంది. అధికారాంతమున అధికార పార్టీ ఇలా జల నాటకంతో ఎన్నికల స్టంట్ చేసిందన్న విమర్శలు నెలకొన్నాయి.

- రామకుప్పం

- అప్పుడే ఎండిపోయిన హంద్రీ నీవా కాలువ
- ఆవిరైన రైతన్న ఆశలు
- అంతా ఎన్నికల స్టంటేనంటూ విమర్శలు

కుప్పానికి కృష్ణా జలాలు వచ్చేశాయి. నియోజకవర్గంలోని అన్ని చెరువులు నీటితో నిండిపోతాయంటూ అధికారపార్టీ నేతలు చెప్పారు. కానీ, మూడు వారాల్లోనే కాలువ ఎండిపోయింది. కుప్పానికి హంద్రీ నీవా జలాలను తీసుకు రావాలని టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. కుప్పం బ్రాంచి కెనాల్ పనులను 83 శాతానికిపైగా పూర్తి చేసింది. 2019 ఎన్నికలకు ముందు వి.కోట మండలం కృష్ణాపురం వరకు కృష్ణాజలాలు వచ్చాయి. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. అప్పట్లోనే మిగిలిన పనులు పూర్తి చేసుంటే ఇప్పటికి పలు దఫాలు కుప్పం ప్రాంత చెరువులకు జలాలు చేరేవి. కానీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ళు ఆ విషయాన్ని పట్టించుకోలేదు. త్వరలో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆదరాబాదరాగా పనులు చేపట్టింది. సీఎం చేత హడావిడిగా జలాల విడుదల కార్యక్రమం చేపట్టారు. రామకుప్పం మండలం రాజుపేట వద్ద గత నెల 26న సీఎం జగన్ బటన్ నొక్కి కృష్ణాజలాలను కుప్పం వైపు విడుదల చేశారు. రెండు రోజులు గడవక ముందే కాలువలో జలప్రవాహం తగ్గిపోయింది. ఈ ఈ జలప్రవాహం తీరును వివరిస్తూ ఇప్పట్లో కుప్పం నియోజకవర్గంలోని చెరువులకు నీరందే అవకాశమే లేదని మీడియాలో కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన అధికారులు నిజనిర్ధారణ పేరిట ఫిబ్రవరి 28న ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి మాల్యాల వద్ద ఎత్తిపోతల ద్వారా 960 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. అక్కడి నుంచి 600 క్యూసెక్కుల జలాలు జీడిపల్లె జలాశయానికి చేరుతున్నాయని తెలిపారు. అక్కడ్నుంచి చెర్లోపల్లె రిజర్వాయర్‌కు.. అక్కడ్నుంచి పుంగనూరు ఉపకాలువలోని 8ఎత్తిపోతల ద్వారా కుప్పం ఉపకాలువకు నిరంతరాయంగా నీరు సరఫరా అవుతుందని పేర్కొన్నారు. ఈ జలాలతో నియోజకవర్గ పరిధిలోని 54చెరువులను నింపుతామని తెలిపారు. మొదటగా రాజుపేట నుంచి కిలో మీటరు సమీపంలోని మద్దికుంట చెరువును జలాలతో నింపి, అక్కడి నుంచి నాగసముద్రం చెరువు, మణీంద్రం చెరువుల మీదుగా కెంచనబల్ల తోట్ల చెరువుకు, ఆ తర్వాత నియో.కవర్గంలోని చెరువులకు జలాలు చేర్చే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. అయితే మద్దికుంట చెరువు నిండి మొరవ పోకుండానే, కాలువగేట్‌ను మూసివేసి, జలాలను అత్తికుప్పం వీరాశీచెరువుకు వదిలారు.

క్షేత్రస్థాయిలో భిన్నంగా.. : అధికారులు చెప్పిన దానికంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అందరూ అనుకున్నట్టే పదిరోజులు గడిచే సరికి కాలువలో నీళ్లు లేక ఎండిపోయింది. పలమనేరు, కుప్పం నియోకవర్గాల్లో కాలువలు బీటలు వారాయి. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే వైసీపీ పెద్దలు ఈ జలనాటకం నడిపారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికోసం ఎక్కడికక్కడ కాలువల్లో కట్టలు కట్టి.. నీటిని నిలుపుతూ పారించారని స్థానికులు చెబుతున్నారు. ఈ అరకొర నీటి ప్రారంభోత్సవానికి పెట్టిన రూ.కోట్ల ఖర్చు వల్ల కుప్పం రైతులకు జరిగిన మేలు ఏమో కానీ.. ఈ కార్యక్రమాన్ని చంద్రబాబుపై ఆరోపణలు గుప్పించడానికి సీఎం జగన్ ఉపయోగించుకున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

అబ్బో.. మునిగిపోబోతావ్!

- ఈ నీళ్లు సీఎం జగన్‌కే కనిపిస్తాయంటూ ఎద్దేవా

ఈ జల నాటకంపై వి.కోట మండలం కృష్ణాపురం వద్ద కొందరు యువకులు చేసిన వ్యంగ్య వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో ఏముందంటే.. 'జగనన్న వదిలిన నీటితో కాలువ పొంగి పొర్లుతోంది. ఈత కొడదాం పదండి' అంటూ కొందరు యువకులు కాలువ వద్దకు వస్తారు. కాలువలోకి దిగి ఈత కొడుతున్నట్టు పాకుతూ నటిస్తారు. 'కాలువలో ఎక్కువ జలాలు ఉన్నాయి, మునిగిపోబోతావ్.. జాగ్రత్త' అంటూ ఒకరు మిగతా స్నేహితులను అప్రమత్తం చేస్తారు. అమ్మో.. జల ప్రవాహంలో కొట్టుకుపోతున్నామంటూ మరొకరు వ్యాఖ్యలు చేస్తూ కాలువలో కాసేపు పాకుతూ వెళ్లారు. చివరగా.. ఈ కాలువలో నీళ్లు సీఎం జగన్‌కు, పలమనేరు ఎమ్మెల్యేకు మాత్రమే కనిపిస్తాయని ఎద్దేవా చేశారు.



కృష్ణాపురం వద్ద నీళ్లులేని కాలువలో ఈత కొడుతున్నట్టు పాకుతున్న యువకులు

నేడే ఎన్నికల షెడ్యూల్ విడుదల

- అధికారుల శిక్షణ తరగతుల్లో జేసీ శ్రీనివాసులు



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 15: సాధారణ ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదల కానుందని జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పనిచేయాలని సూచించారు. చిత్తూరులోని జడ్పీ మీటింగ్ హాలు, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పోలింగ్ రోజు ఉదయం రాజకీయ పార్టీల ఏజెంట్లచే మాక్ పోలింగ్ చేయించి, వారు సంతృప్తి పొందిన తర్వాత సరిగ్గా 7 గంటలకు పోలింగ్ ప్రక్రియను ప్రారంభించాలని స్పష్టం చేశారు. మాక్ పోలింగ్ చేయకుండా పోలింగ్ ప్రారంభించరాదని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఎలాంటి ద్రవపదార్థాలు, మారణాయుధాలు తీసుకెళ్లరాదన్నారు. ఓటింగ్ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో మీడియాను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించేది లేదని చెప్పారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లే ముందు రోజు పీవో, ఏపీవో, ఇతర పోలింగ్ సిబ్బంది వారికి నిర్ధేశించిన డిస్పాచింగ్ సెంటర్‌కు వెళ్ళి ఈవీఎంలు పొందేంతవరకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. పీవో డైరీని ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని, అలక్ష్యం చేస్తే ఏదైనా సంఘటనలు జరిగితే ఇబ్బందులకు గురికావాల్సివస్తుందని హెచ్చరించారు. నియోజకవర్గాల కేంద్రాల పరిధిలో ఆర్వోల ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి త్వరలో రెండో విడత శిక్షణ ఉంటుందన్నారు.

వైసీపీ ముఖ్య నేతలపై కేసు

పుంగనూరు, మార్చి 15: పుంగనూరులో ఈనెల 13న బీజేపీ నేత పూల ప్రేమ్‌కుమార్‌పై జరిగిన దాడి ఘటనలో వైసీపీ ముఖ్యనేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై దాడి చేసి చొక్కాచింపి, దుర్భాషలాడారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర జానపదకళల అకాడమీ చైర్మన్ కె.నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్ముతో పాటు చైర్మన్ పీఏ, వైసీపీ నాయకులు జయకుమార్‌యాదవ్, మంజు, నరసింహులు తదితరులపై ఐపీసీ 341, 323, 506 సెక్షన్ల ప్రకారం హెడ్ కానిస్టేబుల్ మహేంద్రబాబు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు.

బీజేపీ నాయకులపైనా..

పుంగనూరు రూరల్: పుంగనూరు బీజేపీ నాయకుడు ప్రేమ్‌కుమార్‌తో పాటు మరికొందరు తనను కులంపేరుతో దూషించారని వైసీపీ కౌన్సిలర్ మనోహర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ నరసింహులు తెలిపారు. ఈనెల 13వ తేదీ మనోహర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉండగా ప్రేమ్‌కుమార్, నానబాలకుమార్, పెద్దమరంబాబు, ఆదినారాయణ మరికొందరు కులం పేరుతో తిట్టారని శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



చెట్లనూ వదలని రంగుల పిచ్చి

చిత్తూరు, మార్చి 15: ఇన్నాళ్లూ.. వాటర్ ట్యాంకుల నుంచి విద్యుత్ స్తంభాల వరకు, పట్టాదార్ పాసు పుస్తకాల నుంచి ప్రభుత్వ కార్యాలయాల వరకు.. వైసీపీ రంగులు వేసుకున్నారు. తాజాగా చిత్తూరు దర్గాసర్కిల్ నుంచి సీబీ రోడ్డు వరకు ఉన్న డివైడర్లలోని 20 చెట్లకు కూడా వైసీపీ రంగులేసేశారు. కెమికల్ రసాయనాలతో ఉన్న రంగులను చెట్లకు వేయడంతో అవి ఎండిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.

రేపు గ్రూప్-1 పరీక్షలు: డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 15: ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు ఆదివారం చిత్తూరులోని మూడు కేంద్రాల్లో జరగనున్నాయని డీఆర్వో పుల్లయ్య తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై వివిధశాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ (సెల్ నెంబరు: 94910 77356) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులకు సందేహాలుంటే నివృత్తి చేసుకోవచ్చన్నారు. 2,517 మంది అభ్యర్థుల కోసం ఎస్వీసెట్ (ఆర్వీఎస్ నగర్), సీటమ్స్ కాలేజ్ (మురకంబట్టు), పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల (చిత్తూరు)లను పరీక్ష కేంద్రాలుగా గుర్తించామని చెప్పారు. నిర్దేశించిన సమయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ట్రాన్స్‌కో జేఈ దేవప్రకాష్, ఆర్టీసీ డీఎం కృష్ణమూర్తి, వైద్యశాఖ అధికారి రాజారావు, కలెక్టరేట్ పరీక్షల నిర్వహణ విభాగం సూపరింటెండెంట్ గుణశేఖర్ రెడ్డి, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ అమ్మాజీ, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శనివారం) : సా. 6.29
సహరి (ఆదివారం) : ఉ. 4.59

డీసీసీబీలో దొడ్డిదారి పదోన్నతులు!

- జనరల్ బాడీ అనుమతి పొందకుండానే నిర్ణయం
- కోడ్ వస్తున్నందున ఆగమేఘాలపై పోస్టింగ్

జిల్లా సహకారకేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో నిబంధనలకు విరుద్ధంగా.. దొడ్డిదారిన పదోన్నతులు కల్పించారు. బ్యాంకు సర్వసభ్య సమావేశంలో చర్చించకనే.. ఆమోదం పొందకనే పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడం విమర్శలకు తావిస్తోంది. మరోవైపు ఎన్నికల షెడ్యూల్ శనివారం రానుండటంతో వారికి శుక్రవారమే పోస్టింగ్స్ ఇచ్చేశారు. అధికారుల తీరుపై కొందరు అర్హులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

- చిత్తూరు కలెక్టరేట్



బ్యాంకు విస్తరణలో భాగంగా కేంద్ర ఆదేశాల మేరకు అన్ని మండలకేంద్రాల్లో బ్యాంకు బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు డీసీసీబీ పాలకవర్గం నిర్ణయించింది. ఇందులో భాగంగా బ్యాంకు బ్రాంచ్‌ల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సర్వీసును బట్టి మేనేజర్లకు చీఫ్ మేనేజర్లుగా, అసిస్టెంట్ మేనేజర్లను మేనేజర్లుగా పదోన్నతులు కల్పించాలి. పదోన్నతులు కల్పించేముందు బ్యాంకు సెవెన్‌మెన్ కమిటీ చర్చించి అజెండా సిద్ధం చేసి, దానిని బ్యాంకు సర్వసభ్య సమావేశంలో పెట్టి సభ్యుల ఆమోదం పొందిన తర్వాత పదోన్నతులు ఇవ్వాలి. గతంలో 23 మందికి నిబంధనల మేరకే అసిస్టెంట్ మేనేజర్లకు మేనేజర్లుగా, మేనేజర్లకు చీఫ్ మేనేజర్లుగా పదోన్నతులు కల్పించారు. అంతవరకు బాగానే ఉంది. అయితే మరికొందరు ఉద్యోగులు పాలకపక్షం నేతలను కలిసి తమకు కూడా పదోన్నతులు కల్పించాలంటూ కోరారు. అందుకు 'ఒప్పందం' కూడా కుదుర్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. అంతే.. అడ్డదారిలో పదోన్నతులు ఇచ్చేందుకు పాలకపక్షం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హడావిడిగా ఎనిమిది మంది అసిస్టెంట్ మేనేజర్లకు మేనేజర్లుగా, ఇద్దరు మేనేజర్లకు చీఫ్ మేనేజర్లుగా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం పోస్టింగ్స్ కూడా మూడోకంటికి తెలియకుండానే ఇచ్చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి శనివారం నుంచి అమల్లోకి రానున్న క్రమంలో హడావిడిగా ఈ తతంగాన్ని పూర్తి చేసేశారు. దీనిపై అర్హులైన మిగతా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

విచారణ చేపట్టాలి

డీసీసీబీ బ్యాంకులో అడ్డగోలుగా జరిగిన పదోన్నతుల అంశంపై కలెక్టర్ షన్మోహన్ విచారణ జరిపి నిలుపుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజన్ డిమాండ్ చేశారు. గతంలో, ప్రస్తుతం జరిగిన పదోన్నతుల అంశంపై సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. అందుకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిబంధనల మేరకే

ఈ విషయమై డీసీసీబీ సీఈవో మనోహర్ గౌడ్‌ను వివరణ కోరగా.. తామెక్కడా నిబంధనలను అతిక్రమించలేదన్నారు. పదోన్నతుల అంశాన్ని పాలకవర్గం బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకోవచ్చని, జనరల్ బాడీ అనుమతి పొందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.



బీసీవై పార్టీ నేతలతో గొడవకు దిగిన వైసీపీ నాయకులు

కారు జెండా లాగేసి..!

- బసినేపల్లెలో బీసీవై పార్టీ ప్రచారాన్ని అడ్డుకున్న వైసీపీ శ్రేణులు

పుంగనూరు, మార్చి 15: 'వైసీపీ ఎన్నికల ప్రచారం ముగిసేవరకు గ్రామంలోకి ఎందుకు వచ్చారు? మీకేం పని.. ముందువెళ్లండి' అంటూ అధికార పార్టీ నాయకులు శుక్రవారం బీసీవై నేతలను అడ్డుకున్నారు. కారుకున్న జెండా లాగేశారు. ఈ ఘటన పుంగనూరు మండలం బసినేపల్లెలో జరిగింది. బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ తరఫున ఆ పార్టీ నాయకులు మ్యానిఫెస్టో అందజేసి కుమ్మరగుంట, వనమలదిన్నె, బసినేపల్లె, మేకనజామనపల్లె గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బసినేపల్లెకు వెళ్లగానే వైసీపీ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి, మరికొందరు వీరి కారు వద్దకు వచ్చారు. తాము ఎన్నికల ప్రచారం ముగించుకుని వెళ్లిన తర్వాత గ్రామంలో రావాలని సూచించారు. ఇక్కడ మీకేం పని.. వెళ్లండంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తూ గొడవకు దిగారు. మీ మాదిరిగానే తామూ ప్రజలను కలిసి ప్రచారం చేస్తామని, తమను ఎందుకు అడ్డుకుంటున్నారని బీసీవైపీ నాయకులు హరియాదవ్, ఆనంద్, వేణుగోపాల్‌రెడ్డి, కిరణ్, సురేంద్ర, విశ్వనాథరెడ్డి, ఆనందరెడ్డి ప్రశ్నించారు. ఈ గొడవ నేపథ్యంలో కొందరు వైసీపీ కార్యకర్తలు కారుకు కట్టిన బీసీవై పార్టీ జెండాను లాగి పడేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదాలు జరిగాయి. వైసీపీ నాయకులు కొందరు జోక్యం చేసుకుని పార్టీ శ్రేణులను వెనక్కి తీసుకెళ్లడంతో వివాదం సద్దుమణిగింది.



కారుకు ఉన్న జెండా పీకేస్తున్న వైసీపీ కార్యకర్తలు

పార్లమెంటు రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్

- అసెంబ్లీ ఏఆర్వోల నియామకం



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 15: ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు స్థానానికి, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమించారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో)గా కలెక్టర్ షన్మోహన్ (సెల్ నెం. 94910 77001) వ్యవహరించనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు జాయింట్ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలను ఏఆర్వోలుగా నియమించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం వీరి ఆధ్వర్యంలో జరుగుతుంది. అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆర్వోలతో పాటు ఈఆర్వోలుగా ఆయా మండలాల తహసీల్దార్లను నియమిస్తూ ఆదేశాలు అందాయి. అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల అధికారులు వీరే..

నియోజకవర్గం	ఏఆర్వో	ఫోన్ నెంబరు
పుంగనూరు	టి.మధుసూదన్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కేఆర్‌సీసీ	8125120979
నగరి	కె. వెంకటరెడ్డి, ఆర్డీవో	9491077099
గంగాధరనెల్లూరు (ఎస్సీ)	వెంకటశివ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఐవోసీఎల్	7337027151
చిత్తూరు	పి. శ్రీనివాసులు, జేసీ	9491077002
పూతలపట్టు (ఎస్సీ)	జి. చిన్నయ్య, చిత్తూరు ఆర్డీవో	9491077005
పలమనేరు	ఎన్. మనోజ్ రెడ్డి, ఆర్డీవో	9491077017
కుప్పం	జి. శ్రీనివాసులు, ఆర్డీవో	9491074513



కపిలతీర్థం ఆలయం వద్ద ఓట్లు అభ్యర్థిస్తున్న ఆరణి శ్రీనివాసులు

'ఆరణి'తో అడ్జస్టవ్వాలా? వద్దా?

- కూటమి నాయకుల మల్లగుల్లాలు
- ఫోన్ మంతనాల్లో జనసేన అభ్యర్థి

తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిగా ఎంపికైన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో సర్దుకు పోవాలా, లేదా అన్న మీమాంసలో కూటమి నేతలు ఉన్నారు.స్థానికులను కాదని చిత్తూరుకు చెందిన వ్యక్తిని తిరుపతి అభ్యర్థిగా తీసుకు రావడం టీడీపీ-జనసేన నాయకుల్లో అసమ్మతి కుంపటి రాజేసిన విషయం తెలిసిందే.అభ్యర్థికి సహకరించకపోతే తీవ్రమైన చర్యలు తీసుకుంటామంటూ ఇరు పార్టీల అధిష్టానాల నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో అసమ్మతి నేతలు కాస్త చల్లబడ్డట్టు తెలుస్తోంది. అయితే వైసీపీ అభ్యర్థిని ఓడించడమే ధ్యేయంగా పనిచేయాలంటే స్థానికత చాలా కీలకమన్న భావనలో ఉన్న బలిజ సామాజికవర్గానికి చెందిన ముగ్గురు నేతలు ఇప్పటికీ ఆరణితో మాట్లాడేందుకు అంగీకరించడంలేదు.ఈ క్రమంలో శుక్రవారం అరణి శ్రీనివాసులు తిరుపతికి వచ్చారు. అయితే టీడీపీ నుంచి కోడూరు బాలసుబ్రమణ్యం, జనసేన నుంచి పసుపులేటి హరిప్రసాద్ మాత్రమే ఆయన వెంట కనిపించారు. అక్కడినుంచి హోటల్‌కు చేరుకుని అసమ్మతి నాయకులతో ఫోన్లో మాట్లాడే ప్రయత్నం చేశారు.టీడీపీ నేతలు నరసింహ యాదవ్, బుల్లెట్ రమణ తదితరుల ఇళ్లకు వెళ్లినట్టు సమాచారం. మూడు పార్టీలు కలిసే తనను ఎంపిక చేశారని చెప్పుకొచ్చిన శ్రీనివాసులు ఇంతకాలం కష్టపడిన నాయకుల్లో అసంతృప్తి వుండడం సహజమేనని, అయితే త్వరలోనే అన్నీ సర్దుకుంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జనసేన అభ్యర్థి శ్రీనివాసులుకు వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డి ఎదురుపడ్డారు.అభివాదం చేసుకుని బాగున్నారా అంటూ కరచాలనం చేసుకున్నారు.యాధృచ్ఛికంగా జరిగిన వీరి కలయిక వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆరణి వైసీపీ నాయకుడే కాబట్టి వచ్చీరాగానే ఆ పార్టీ అభ్యర్థితో మాటలు కలిపారన్న చర్చ నడిచింది.



మీడియా సమావేశంలో నగరి నేతల ప్లకార్డుల ప్రదర్శన

వెంకటగిరి, నగరిల్లో

వైసీపీ వర్గపోరు

నేదురుమల్లి, రోజాలకు టికెట్లిస్తే పనిచేయమంటున్న జగన్ తమ్ముళ్లు

తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి, నగరి నియోజకవర్గాల అధికార పార్టీలో వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. శనివారం ఈసీ ఎన్నికల షెడ్యూలును, వైసీపీ అధిష్ఠానం అభ్యర్థుల జాబితానూ విడుదల చేయనున్న నేపథ్యంలో ముందు రోజు జరిగిన పరిణామాలు పార్టీ వర్గాలను కలవరపాటుకు గురి చేశాయి. అసమ్మతి నేతల బలాన్ని పక్కన పెడితే ఎన్నికల ప్రారంభంలో ఇలాంటి ప్రచారం పార్టీ విజయావకాశాలను గణనీయంగా దెబ్బతీస్తుందని శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.వెంకటగిరి వైసీపీలో ఇటీవల సద్దుమణిగి నట్టు కనిపించిన అసమ్మతి శుక్రవారం ఒక్కసారిగా భగ్గుమంది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వైసీపీకి దూరం కాగా ఆయన స్థానంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ ఇంచార్జిగా నియమితులయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులను దక్కించుకోవడంతో జిల్లాలో నేదురుమల్లికి సీఎం జగన్ ఎంత ప్రాధాన్యత ఇస్తున్నదీ తేటతెల్లమైంది.దీంతో నియోజకవర్గంలో బలపడాల్సిన రామ్‌కుమార్‌రెడ్డి దానికి భిన్నంగా సొంత పార్టీలోనే బలహీనపడ్డారు. ఆనం రామనారాయణరెడ్డి సన్నిహితులనే అనుమానంతో పలువురు పార్టీ నేతలను దూరం పెట్టారు. అందరినీ కలుపుకుపోవడంలో విఫలమయ్యారు. ప్రారంభంలో అసమ్మతి వర్గం ఆయనకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగించినా రామ్‌కుమార్‌రెడ్డి తల్లి రాజ్యలక్ష్మి వారితో మాట్లాడి బుజ్జగించడంతో కొంతమేరకు సద్దుమణిగింది.దీంతో ఎన్నికలు సమీపించినందున అంతా సర్దుకుపోయి నట్టేనని అధిష్ఠానం భావించింది. అలాంటిది శుక్రవారం హఠాత్తుగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచీ ప్రజాబలం కలిగిన పలువురు నేతలు తమ అనుచర వర్గంతో రేణిగుంటలోని విమానాశ్రయం వద్దకు వెళ్ళి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఇంచార్జిగా నియమితులైన నాటి నుంచీ పార్టీలో అందరినీ కలుపుకుని వెళ్ళడం లేదని ఆరోపించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆయనకు టికెట్ ఇవ్వొద్దని డిమాండ్ చేశారు.రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తే ఆయన గెలుపు కోసం తాము పనిచేసేది లేదని కుండ బద్దలు కొట్టారు. కాదని ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినా ఆయన ఓటమి ఖాయమని తేల్చి చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచీ కీలక నేతలు, వారి అనుచరులు మూకుమ్మడిగా రావడంతో పాటు రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తే పని చేసేది లేదంటూ నిర్మొహమాటంగా చెప్పడంతో మంత్రి పెద్దిరెడ్డి ఖంగు తిన్నారు. ఎన్నికల షెడ్యూలు వెలువడడానికి 24 గంటల సమయం కూడా లేని తరుణంలో వెంకటగిరిలో తలెత్తిన అసమ్మతి తీవ్రతను గుర్తించిన ఆయన తనకు ఒక రోజు సమయం ఇస్తే ఆలోపు అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానని సర్దిచెప్పారు. ఒక రకంగా చెప్పాలంటే వెంకటగిరి వైసీపీ అసమ్మతి వర్గం బలప్రదర్శనకు శుక్రవారం విమానాశ్రయ ఆవరణ వేదికైంది. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ముఖ్యనేత కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో అసమ్మతి వర్గం మంత్రిని కలవగా ఆ బృందంలో వెంకటగిరి వైసీపీ టికెట్ రేసులో వున్న డీసీసీబీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి సైతం వున్నారు. మంత్రిని కలసిన వారిలో వెంకటగిరి ఎంపీపీ తనూజ భర్త శివారెడ్డి, రాపూరు ఎంపీపీ ప్రసన్న, చెన్ను తిరుపాల్‌రెడ్డి, బాలాయపల్లి ఎంపీపీ వెందోడి భాస్కర్‌రెడ్డి, కలువాయి మండల నేత రాఘవరెడ్డి, సైదాపురం జడ్పీటీసీ, ఎంపీపీలు, ఆ మండల నేత నోటి రమణారెడ్డి, డక్కిలి వైస్ ఎంపీపీ గడ్డం సుధీర్‌రెడ్డి, ఆ మండల నేత మాధవరెడ్డిలతో పాటు వెంకటగిరి, రాపూరు మండలాలకు చెందిన 20మంది సర్పంచులు, వారి వర్గీయులు వున్నారు. ఎన్నికల షెడ్యూలుకు ముందురోజు సంభవించిన ఈ పరిణామం వెంకటగిరి నియోజకవర్గ అధికార పార్టీలో కలకలం సృష్టించింది.

అసమ్మతి వర్గంలో రోజాపై వీడని వ్యతిరేకత

నగరి విషయానికొస్తే మంత్రి రోజాకు అసమ్మతి బెడద తగ్గడం లేదు సరికదా అంతకంతకూ పెరుగుతోంది. ఎంతోకాలంగా రోజాను వైసీపీలో పలువురు నేతలు వ్యతిరేకిస్తూ వస్తున్నా అధిష్ఠానం పట్టించుకున్న దాఖలాల్లేవు. ఎన్నికలు సమీపించేసినందున ఇక అసమ్మతి వర్గం సర్దుకుపోతుందని భావిస్తున్న తరుణంలో ఆ అంచనాలు తారుమారయ్యాయి. శుక్రవారం నియోజకవర్గానికి చెందిన పలువురు మండల స్థాయి నేతలు తిరుపతిలో మీడియా సమావేశం పెట్టి మరోసారి తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.రోజాకు టికెట్ ఇవ్వకూడదని అధిష్ఠానాన్ని వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి కోరారు. తమ మాట కాదని టికెట్ ఇస్తే ఆమెను ఓడిస్తామని హెచ్చరించారు.ఈ విషయంలో అధిష్ఠానం మాట కూడా వినే పరిస్థితిలో లేమని అన్నారు. రోజా అక్రమాలు, వేధింపులపై పార్టీ నేతలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. అసంతృప్త నేతలతో అధిష్ఠానం మాట్లాడి ఒప్పించిందని, ఇప్పుడు అంతా సవ్యంగా ఉందనే ప్రచారంలో ఏమాత్రం నిజం లేదన్నారు.ఎప్పటికీ ఆమెపై ఉన్న వ్యతిరేకత పోయే పరిస్థితి లేదన్న విషయాన్ని పార్టీ అధిష్ఠానం తెలుసుకొని ఇంకొకరికి సీటు ఇస్తే కష్టపడి గెలిపించుకుంటామన్నారు. అధికారంలోకి రాక ముందు రోజాకు ఉన్న అప్పులు, ఇప్పుడు ఉన్న ఆస్తులను పరిశీలిస్తే ఆమె ఏ స్థాయిలో అక్రమాలకు, అవినీతికి పాల్పడిందో తెలుస్తుందన్నారు.బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతిరాజు, ఎంపీటీసీ రవిశేఖర్‌రాజు, వైసీపీ నేతలు తులసీరాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునేంద్ర, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ



ఇందిరమ్మను టీడీపీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

పాలసముద్రం, మార్చి 15: పాలసముద్రం మాజీ ఎంపీపీ బి.ఇంది రమ్మ శుక్రవారం టీడీపీలో చేరారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు సమక్షంలో ఆమె పార్టీలోకి వచ్చారు. ఐదేళ్లుగా ఈమె వైసీపీలో ఉంటున్నారు. అలాగే నిశ్శింకాపురం గ్రామానికి చెందిన చల్లయ్య నాయుడు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిద్దరికీ చంద్రబాబు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. గంగాధరనెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్ గెలుపుకోసం పనిచేయాలని సూచించారు. వీరివెంట పాలసముద్రం, శ్రీరంగరాజపురం టీడీపీ అధ్యక్షులు సి.రాజేంద్రన్, గంధమనేని జయశంకర్ నాయుడు, మాజీ ఎంపీటీసీ బాబు నాయుడు, నాయకులు వినోద్, రాజశేఖర్ నాయుడు, చేతన్ తదితరులున్నారు. అనంతరం వీరు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని కలిసి సన్మానించారు.

కమ్మ భవన్ నిర్మాణానికి ఇందుశేఖర్ భారీ విరాళం

తిరుపతి (కొర్లగుంట), మార్చి 15 : తిరుపతి సమీపంలోని వకుళమాత ఆలయం దగ్గర తిరుపతి కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం నిర్మించతలపెట్టిన అంతర్జాతీయ కమ్మ భవనం నిర్మాణానికి చంద్రగిరి టీడీపీ నేత కొల్లూరి ఇందుశేఖర్ రూ. కోటిన్నర విరాళం ప్రకటించారు. తన తాత, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే మేడసాని వెంకటరామానాయుడు అలియాస్ మీసాల నాయుడు పేరిట రూ. కోటితో కన్వెన్షన్ హాలు, తన తండ్రి కొల్లూరి మోహన్ నాయుడు పేరిట రూ. 50 లక్షలతో భోజనశాల నిర్మించాలని ఆయన సంఘ నిర్వాహకులను కోరారు. అంతర్జాతీయ కమ్మ భవన నిర్మాణానికి భారీ విరాళం ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం కమ్మ సంఘం అధ్యక్షులు పులిపాటి పురంధరనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేమూరి జయరాం ప్రసాద్, ఉపాధ్యక్షుడు రామచంద్ర నాయుడు, సభ్యుడు లీలాకృష్ణమ నాయుడు తదితరులు కొల్లూరు ఇందుశేఖర్ దంపతులను వారి నివాసంలో ఘనంగా సత్కరించారు.



కొల్లూరి ఇందుశేఖర్ దంపతులకు కమ్మ సంఘ ప్రతినిధుల సత్కారం

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో

ఐరాల(కాణిపాకం), మార్చి 15: కాణిపాక వరసిద్ధుడిని శుక్రవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, డీఎస్పీ రాజగోపాల్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

15 రోజులు.. రూ.7 కోట్లు

- పంచాయతీల్లో పన్నుల వసూళ్ల లక్ష్యం సాధ్యమా?

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 15: ఈ ఆర్థిక సంవత్సరం మరో 15 రోజుల్లో ముగియనుంది. అప్పట్లోగా పన్నులు.. పన్నేతర వసూళ్లు రూ.7 కోట్లు కావాలి. పంచాయతీల్లో ఇది సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది. దీని ప్రభావం అభివృద్ధిపై పడుతుందన్న ఆందోళనా వ్యక్తమవుతోంది. గత ఏడాది నుంచి పంచాయతీల్లో లావాదేవీలన్నింటినీ డిజిటల్ విధానంలోనే నిర్వహిస్తున్నారు. వీటిపై గ్రామీణులకు తగిన అవగాహన లేకపోవడం, సిబ్బంది కొరతతో ఈ ఏడాది వివిధ పన్నుల వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. శుక్రవారం వరకు 62.16శాతం మాత్రమే వసూళ్లయ్యాయి. జిల్లాలో 697 గ్రామపంచాయతీలున్నాయి. ఇంటిపన్నులు, నాన్ ట్యాక్సస్ వసూళ్లు కాకపోవడంతో ఈ పంచాయతీల ఆర్థిక పరిస్థితి దిగజారింది. బకాయిల్లో ఎక్కువ భాగం ప్రభుత్వ కార్యాలయాల నుంచే ఉంది. మరోవైపు కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లులు, ఇతరత్రా వాటికి మళ్లించేస్తోంది. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి అటకెక్కింది. అత్యవసర పారిశుధ్య నిర్వహణ పనులూ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. పలు పంచాయతీల్లో పన్నుల సొమ్ము దుర్వినియోగమైన ఘటనలు గతంలో వెలుగుచూశాయి. ఈ క్రమంలో కేంద్రప్రభుత్వం పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులను తప్పనిసరి చేసింది. గతేడాది ఆగస్టు నుంచి జిల్లాలో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. 3000 లోపు జనాభా ఉన్న గ్రామాల్లో యూపీఐ, క్యూఆర్ కోడ్‌ల ద్వారా, ఆపై జనాభా వున్న గ్రామాల్లో పాయింట్ ఆఫ్ సేల్) మిషన్ ద్వారా పన్నుల వసూళ్ళు చేయాలి. జిల్లావ్యాప్తంగా 113 పంచాయతీలకు గాను 145 పీవోఎస్‌లను అందజేశారు. కానీ, పన్నుల వసూళ్లు మాత్రం మందకొడిగా ఉన్నాయి. గత 350 రోజుల్లో 62.16 శాతం పన్నుల వసూళ్లు జరగ్గా, మిగిలిన 15 రోజుల్లో 38 శాతం (రూ.5.59 కోట్లు).. పన్నేతరకు సంబంధించి రూ.1.47 కోట్లు వసూలు కావాల్సి ఉంది. నెలాఖరులోగా ఇది సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

ఇవీ లోపాలు ...

డిజిటల్ చెల్లింపులపై గ్రామీణ ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో వారంతా పన్నులు చెల్లించేందుకు పంచాయతీ కార్యాలయాలకు నగదుతో వస్తున్నారు. కానీ యూపీఐ లేదా క్యూఆర్ కోడ్, పీవోఎస్‌లతో మాత్రమే చెల్లింపులు చేయాలని పంచాయతీ సిబ్బంది చెబుతుండడంతో ఆ సౌలభ్యం తెలియని గ్రామీణులు పన్నులు చెల్లించకుండా వెనుతిరుగుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల తాత్సారం, పోస్టుల ఖాళీ, సిబ్బంది కొరత, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, క్షేత్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్ళు కూడా పన్నుల వసూళ్ళపై ప్రభావం చూపుతోంది. నగదు రహిత చెల్లింపులను మరింత వేగవంతం చేసేలా డివిజన్‌స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో వసూళ్లు ఇలా.

గ్రామ పంచాయతీలు	రూ.కోట్లలో..
వసూలు కావాల్సిన పన్నులు	రూ. 14.82
ఇప్పటి వరకు వసూలైంది	రూ.9.21
ఇంకా వసూలు కావాల్సింది	రూ. 5.59
పన్నేతర వసూళ్లు (నాన్ ట్యాక్సస్)	
వసూలు కావాల్సింది	రూ. 7.92
వసూలైంది	రూ.6,46
ఇంకా వసూలు కావాల్సింది..	రూ.1.47

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన 16 మంది సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 15: ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13 నుంచి పీవో, ఏపీవోలకు చిత్తూరులోని రెండు కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. మూడ్రోజులుగా జరిగిన శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైన 16మంది సిబ్బందిని కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు శుక్రవారం రాత్రి సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గైర్హాజరైన పీవో, ఏపీవోలు శనివారం తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆదేశించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 15: ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజున సెకండియర్ విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్ పేపర్-2 పరీక్షలు జరిగాయి. 13,272 మందికిగాను 12,447 మంది హాజరవగా, 825 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. డీవీఈవో నాలుగు, పరీక్షల జిల్లా కమిటీ ఎనిమిది, స్క్వాడ్ ఆరు సెంట ర్లు పరిశీలించారు. కాగా, ఈనెల 20వ తేదీ వరకు ఆప్షనల్ సబ్జెక్టుకు సంబంధించి పరీక్షలు జరగనున్నాయి.



ఏకాంత సేవకు ఆదిదంపతులు

- ముగిసిన ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలు



శ్రీకాళహస్తి, మార్చి 15: ముక్కంటి ఆలయ శివరాత్రి ఉత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం రాత్రి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి ఏకాంత సేవను వేడుకగా నిర్వహించారు.ఆలయం మూసే వేళ స్వామివారి సన్నిధిలో చిన్న వెండి పల్లకిని ముస్తాబు చేసి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల శివనామస్మరణ మధ్య స్వామి సన్నిధి నుంచి అమ్మవారికి పిలుపునిస్తూ జ్ఞానాంబిక సన్నిధికి తీసుకెళ్లగా అక్కడ అమ్మవారి ఉత్సవమూర్తి పల్లకిలో ఆశీనులయ్యారు. అక్కడినుంచి గురుదక్షిణామూర్తి సన్నిధి నుంచి ప్రదక్షిణపూర్వకంగా పల్లకి స్వామి సన్నిధిలో ఎదురుగా ధ్వజస్తంభం వద్దకు చేరుకుంది. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న శివయ్య ఉత్సవమూర్తి పల్లకిలో దేవేరికి ఎదురుగా ఆశీనులయ్యారు. ఆదిదంపతులు అధిరోహించిన పల్లకిని అమ్మవారి గర్భాలయంలోని శయన మందిరం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ అమర్చిన పడక ఊయలలో స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, భక్తులు వెలుపలకు వచ్చి తలుపులు మూయడంతో ఏకాంతసేవ ముగిసింది.ఉత్సమూర్తులకు డ్రైఫూట్స్ మాలలను, ప్రత్యేక సుగంధభరితమైన పూలమాలలను, పండ్లను భక్తులు సమర్పించారు. అర్చకులు పంపిణీ చేసిన ఏకాంత సేవ ప్రసాదాన్ని స్వీకరించారు.కాగా ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని శుక్రవారం ఉదయం వేద పారాయణ సభ జరిగింది.రాష్ట్రవ్యాప్తంగా వివిధ దేవాలయాల నుంచి వచ్చిన 100మంది వేద పండితులు గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదాలను పఠించారు.

ఓటు హక్కు చాలా విలువైనది



కుప్పం వెలుగు కార్యాలయంలో ఓటర్ల ప్రతిజ్ఞ చేస్తున్న ఈసీ సభ్యులు

కుప్పం, మార్చి 15: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనదని డీఆర్డీయే పీడీ బి.శ్రీనివాసమూర్తి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఈసీ సభ్యులకు ఓటు హక్కు విలువల గురించి వివరించారు. సంబంధిత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఓటు హక్కు మనం సద్వినియోగం చేసుకోవడమే కాకుండా ఇతరులు కూడా ఓటు వేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎవరి ఓటు హక్కుకూ భంగం కలుగకుండా వ్యవహరించాలని తెలిపారు.

నెలరోజులుగా కనెక్షన్‌కు నోచుకోని బోరు



పలమనేరు, మార్చి15 : పలమనేరు పట్టణం దోర్నాలచంగన్న వీధిలో నెలరోజుల క్రితం బోరు వేశారు. వేసిన బోరుకు మోటరు కూడా బిగించారు. ఈ బోరుద్వారా దోర్నాలచంగన్న వీధితోపాటు పక్కనే ఉన్న తాలూకా కచ్చేరి వీధి, వీరరాఘవుల వీధి మరికొన్ని వీధులకు తాగునీటి సరఫరా చేయాలన్న ఉద్దేశంతో బోరు వేసి మోటరు బిగించారు. అయితే కారణాలు తెలియదు గానీ నేటి వరకు బోరుకు విద్యుత్ కనెక్షన్ గానీ వేసిన బోరునుంచి వీధిలోని పైప్‌లైన్లకు కనెక్షన్ ఇవ్వలేదు. ఇకనైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి బోరును వినియోగంలోకి తీసుకొచ్చి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అగ్నికి ఆహుతైన మామిడిచెట్లు

కల్లూరు, మార్చి 15: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కొక్కువారిపల్లి సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మామిడిచెట్లు అగ్నికి ఆహుతైనట్లు బాధిత రైతులు తెలిపారు. కల్లూరు-పులిచెర్లకు వెళ్లే రహదారి పక్కన ఉన్న ముళ్ల కంపలకు గుర్తు తెలియని అకతాయిలు నిప్పుపెట్టారు. దీంతో ముళ్ల కంపలు కాలుతూ కొక్కువారిపల్లిలోని రైతు ఖాదర్‌బాషాకు చెందిన మామిడితోట అంటుకోవడంతో 12 మామిడిచెట్లు దగ్ధమయ్యాయి. అదే గ్రామానికి చెందిన రైతులు నారాయణస్వామినాయుడు, నారాయణమ్మ మామిడితోట కంచెలు అగ్నికి ఆహుతయ్యాయి. పీలేరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

కేంద్ర బలగాల కవాతు



సోమల, మార్చి 15: రాబోవు ఎన్నికల దృష్ట్యా ఓటు హక్కుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా ఓటు వేసేందుకు మీకు అండగా మేము ఉన్నామని కేంద్ర బలగాలు శుక్రవారం సోమలలో కవాతు చేశాయి. పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్‌ఐ వెంకటనరసింహులు ఆధ్వర్యంలో 70మంది కేంద్ర బలగాలు పెద్దఉప్పరపల్లె, నంజంపేట, కందూరు, నెల్లిమంద, చిన్నఉప్పరపల్లె వీధుల్లో కవాతులో పాల్గొన్నారు.

సదుం : మండలంలోని పాలమంద, తాటిగుంటపాళెం, రెడ్డివారిపల్లె, సదుం, బూరగమంద, చీకలచేను, తిమ్మానాయునిపల్లెల్లో శుక్రవారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఎస్పీ జాషువా ఆదేశాల ప్రకారం గ్రామాల్లో సాయుధ బలగాల కవాతు నిర్వహించినట్లు చౌడేపల్లె రూరల్ సీఐ కృష్ణారెడ్డి, సదుం ఎస్‌ఐ మారుతి తెలిపారు.

చౌడేపల్లె : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్ఎస్‌బి ఫోర్స్‌తో కవాత్ నిర్వహిస్తున్నట్లు సీఐ కృష్ణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని చౌడేపల్లె, తెల్లనీళ్ళపల్లె, కాగతి, దాదేపల్లె, కాటిపేరి గ్రామాలలో కవాత్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, ఎస్ఎస్‌బి ఫోర్స్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



రామకుప్పం, మార్చి 15: పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం 10గంటలకు వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య సర్వాలంకార శోభితులైన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవర్లను కల్యాణ వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవ తంతు జరిపించారు. భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. కర్ణాటక రాష్ట్రం తుంగలకుప్పంకు చెందిన భక్తులు కల్యాణోత్సవానికి ఉభయదారులుగా వ్యవహరించారు.

గ్రామాల్లో టీడీపీ ప్రచార హోరు


వీర్నమలపెద్దతాండాలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మార్చి 15: రామకుప్పం మండలంలో టీడీపీ శ్రేణులు ప్రచారపర్వాన్ని వేగవంతం చేశారు. గ్రామగ్రామానా కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మణీంద్ర పంచాయతీ చింతకుప్పంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ శ్రీరాములురెడ్డి, వీర్నమలపెద్దతాండాలో ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు రాజకుమార్‌నాయక్, బందార్లపల్లె పంచాయతీల్లో మాజీ సర్పంచు పెరుమాళ్, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, సింగసముద్రంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఇంటింటా సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఆయా గ్రామాల్లో నేతలు రామచంద్ర, మంజునాథ్, గౌడానాయక్, సైరాజ్‌నాయక్, మునీంద్రనాయక్, కుటియానాయక్, పళని, మునిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి


నియామక పత్రాలు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

పుంగనూరు రూరల్, మార్చి15: కాంగ్రెస్‌పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి కాంగ్రెస్ మ్యానిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే రైతు రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధరలు, ప్రతి ఇంటికీ రూ.5వేలు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు, ఇల్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం కాంగ్రెస్ మండల, టౌన్ పార్టీ అధ్యక్షులుగా మౌసీనా, ఎంఎస్ హసిఫ్‌బాషాను ఎంపిక చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీదేవి, సైదాని, మంకునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పులిచెర్లలో చల్లా పర్యటన

కల్లూరు : పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లి, దిగువపోకలవారిపల్లి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీల్లో శనివారం చల్లా రామచంద్రారెడ్డి పర్యటిస్తున్నట్లు రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

సైకో పాలనకు చరమగీతం పాడాలి : అమర్


చెన్నారెడ్డిపల్లె, రాయలపేట, సొలింపల్లెలలో టీడీపీలో చేరిన వారితో మాజీమంత్రి అమరనాథ రెడ్డి

పెద్దపంజాణి, మార్చి15: రాష్ట్రంలో సైకో పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దపంజాణి మండలం రాయలపేట పంచాయతీలో ఇంటింటికి తెలుగుదేశం, బాబుష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అభివృద్ధిని గాలికొదిలేసి కక్షసాధింపే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు ఆలోచించి ఓటు వేయాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మన అందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదర్శవంతమైన అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

భారీగా పార్టీలో చేరికలు

చెన్నారెడ్డిపల్లెలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు వరదారెడ్డి ఆధ్వర్యంలో గ్రామం మొత్తం టీడీపీలో చేరారు. వైసీపీకి కంచుకోటగా ఉన్న ఈ గ్రామం మూకుమ్మడిగా మాజీమంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సిద్దమల్లప్ప, మధు, కార్తీక్, లింగారెడ్డి, ఎస్.బాబు, గణేష్, హేమంత్, రాజేష్, వెంకటరమణ, పురుషోత్తం, మొగిలప్ప, వెంకటరెడ్డి, నరసింహారెడ్డి, టివి.నాగరాజు తదితరులు పార్టీలో చేరారు. వీరందని పార్టీ కండువాలతో సాదరంగా ఆహ్వానించారు.

సొలింపల్లెలో...

సొలింపల్లెలో ఎన్.శివ, హరి, శంకర, మహేంద్ర, రామలక్ష్మణ, రమణ, కౌశికరెడ్డి, క్రిష్ణమూర్తి, గణేష్, టి.శివ, పి.అరవింద్, సురేష్, యశ్వంత్, నాగరాజు, యం.అరవింద్, పిశివ, రమేష్, వెంకటేష్ తదితరులను టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.

రాయలపేటలో.....

రాయలపేట మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్(బుద్దు) తన అనుచరులతో పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి, యువత అధ్యక్షుడు నాగరాజరెడ్డి, నాయకులు సుధాకరరెడ్డి, రోజారెడ్డి, శ్రీరాములు, మురహరిరెడ్డి, బీసీ నాయకులు రవికుమార్, నేమురాజు, విఎల్.రవి, ప్రకాశంశెట్టి, బాలసుబ్రమణ్యం, చెంగారెడ్డి, షౌకత్‌అలీ, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, శివాడినాగనాజు, గంగప్ప, నదీం తదితరులు పాల్గొన్నారు.

బాబు సీఎం అయితేనే కుప్పానికి పూర్వ వైభవం : టీడీపీ


తులసినాయనపల్లెలో గౌనివారి, టీడీపీ నేతలు

శాంతిపురం, మార్చి 15: నారా చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే కుప్పానికి పూర్వ వైభవం వస్తుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు భాష్యం విశ్వనాథ్‌నాయుడులు అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మిశి పంచాయతీ పరిధిలోని తులసినాయనపల్లె, తుమ్మిశి, డుంకుమానుపల్లె గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పరుగులు పెట్టాలంటే చంద్రబాబును లక్ష ఓట్లు మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అంతకు ముందు గ్రామాల్లో టీడీపీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ సురేష్ సమక్షంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రకాష్ అతని అనుచరులతో టీడీపీలో చేరారు. అలాగే అబకలదొడ్డి పంచాయతీ కోతిగుట్లపల్లె గ్రామంలో మండల దళిత నేతలు, మాజీ ఎంపీపీ పుష్ప, మాజీ జడ్పీటీసీ శకుంతల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎదయకుమార్, క్లస్టర్ ఇంచార్జిలు విజయరామిరెడ్డి, చంద్రశఖర్, యూనిట్ ఇంచార్జి నారాయణస్వామి, నేతలు పీవీ నాగరాజు, ఆర్ఎస్ మణి, బసవరాజు, నారాయణరెడ్డి, గోపాల్, జయరాం, శివశంకర్, చలపతి, దళిత నేతలు డాక్టర్ వెంకటేష్, కందస్వామి, కన్నన్, శివకుమార్, బాబు, నారాయణ, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి..అండగా ఉంటా : చల్లా

కల్లూరు, మార్చి 15: నిండు మనసుతో టీడీపీని ఆశీర్వదించాలని, నిరంతరం మీకు అండగా ఉంటానని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పులిచెర్ల మండలంలో ఆయన పర్యటించారు. దేవళంపేట పంచాయతీ వంకాయలపాటివారిపల్లికి విచ్చేసిన చల్లా రామచంద్రారెడ్డికి తెలుగు మహిళలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పాళెం పంచాయతీ తుడుంవారిపల్లి, వడ్డిపల్లి, కొంగరవారిపల్లి, జూపల్లి, కోటపల్లి, దేవళంపేట, కుమ్మపల్లి, చిన్ననగరి, మిట్టమీదరాచపల్లి కొక్కువారిపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా చల్లా బాబురెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఐక్యమత్యంతో పనిచేసి సైకో పాలనను అంతం చేద్దామన్నారు. కల్లూరు బీసీ కాలనీలోని నూరాని మసీదుకు విచ్చేసిన చల్లా బాబురెడ్డికి ముస్లిం మత పెద్దలు ప్రార్థనలు చేసి దీవించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, ఆనందనాయుడు, సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, కుమార్‌రెడ్డి, బండ్లరమేష్, మహేష్, సుదర్శన్‌నాయుడు, పూల రమేష్, నూర్‌బాషా, మోహన్‌దాస్, వెంకట్రామానాయుడు, ఉయ్యాల రమణ, కనుమూరి రమేష్, దేవ, రామకృష్ణమనాయుడు, జూపల్లి బాబు, బాబయ్య, భాస్కర్, నజీర్, వెంకటమునినాయుడు, నారాయణస్వామినాయుడు, రామూర్తి, గోపినాయుడు, పురుషోత్తంనాయుడు, మునికృష్ణమనాయుడు, రవి, శంకర్, సుబ్రమణ్యంనాయుడు, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


చల్లా బాబురెడ్డికి హారతులిస్తున్న మహిళలు

సీఏఏ, ఎన్ఆర్‌సీని వెంటనే రద్దు చేయాలి



పుంగనూరులో నిరసన తెలుపుతున్న ఎస్‌డీపీఐ నాయకులు

పుంగనూరు, మార్చి 15: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీఏఏ, ఎన్ఆర్‌సీ చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు జమీర్‌లాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం పుంగనూరు ఇందిరాసర్కిల్‌లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ ముస్లిం మైనార్టీలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఏఏ, ఎన్ఆర్‌సీ చట్టాల వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తీవ్రంగా నష్టపోతారని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ బిల్లుల వల్ల మతాలను విడగొట్టే విధంగా, బాబాసాహేబ్ అంబేడ్కర్ రాసిన ఆర్టికల్ 14 సమానత్వ హక్కుకు విరుద్దంగా బిల్లు ఆమోదించారన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్యతో పేదరికం పెరిగిందని, బీజేపీ ఈలాంటి ఉన్మాద రాజకీయాలు మానుకోకపోతే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం చేరుకుని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యూసుప్, నాయకులు ముబారక్, చాంద్‌బాషా, సిద్దిక్, మహబూబ్‌బాషా, ఖాదర్‌బాషా, పుంగనూరు నౌజవాన్ కమిటీ అధ్యక్షుడు అయూబ్ పాల్గొన్నారు.

చంద్రబాబు గెలుపుకోసం మసీదులో ప్రార్థనలు



కుప్పం, మార్చి 15: టీడీపీ అధినేత చంద్రబాబు లక్ష ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించి ముఖ్యమంత్రిగా సారథ్యం వహించాలని ఆకాంక్షిస్తూ కుప్పం పట్టణం ఎన్టీఆర్ నగర్‌లో గల మసీదులో శుక్రవారం ముస్లింలతో కలసి ఆ పార్టీ నాయకులు ప్రార్థనలు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్. మునిరత్నం, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా మాట్లాడుతూ టీడీపీ హయాంలో ముస్లింలు ఎంతో సంతోషంగా గడిపారని, చంద్రబాబు కూడా వారికి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. సైకో జగన్ చేతిలో వారు పూర్తిగా నష్టపోయారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గోపీనాథ్, టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జాకిర్, సీనియర్ నాయకులు సర్దార్, అన్సర్, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి రవి, ఇర్ఫాన్, మతిన్, ఇమ్రాన్, షబ్బీర్, ఇస్మాని, సలాం, కలీం, మంజు, సత్యేంద్రశేఖర్, అప్పు ముఖేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, మార్చి15: పుదిపట్లలో వెలిసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ నిర్వహకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వహ కులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వృద్ధురాలి అదృశ్యం

గుడిపాల, మార్చి 15: మండలంలోని చిత్తపార గ్రామానికి చెందిన జయమ్మ అదృశ్యమైనట్లు గుడిపాల ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తపార గ్రామం నుండి గత నాలుగురోజులుగా జయమ్మ కనిపించకపోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, మార్చి15: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వర్క్ ఆర్డర్లు నెలాఖరులోపు పూర్తి చేయాలి : ఎస్ఈ

చిత్తూరు రూరల్, మార్చి 15: పెండింగ్ వర్క్ ఆర్డర్లు ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని, లేదంటే సంబంధిత ఏఈలపై చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఎస్ఈ కృష్ణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని స్టోర్స్‌ను, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని పరిశీలించారు. 2019-20 సంవత్సరానికి సంబంధించిన వర్క్ ఆర్డర్లు ఇప్పటికీ పూర్తి చేయకపోవడం సరికాదన్నారు. ఇలాగే వ్యవహరిస్తే ఏఈల జీతాలనుంచి రికవరీ చేస్తామన్నారు. వేసవి దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, మరమ్మతుకు గురవడం జరుగుతుంటాయన్నారు. ఈ కారణంగా వ్యవసాయానికి, గృహాలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని సూచించారు. ఆయనవెంట ఈఈ హరి, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, ఆనంద్ తదితరులున్నారు.

ముగిసిన మొగిలీశ్వరుడి బ్రహ్మోత్సవాలు



బంగారుపాళ్యం, మార్చి 15: స్వయంభు కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం జరిగిన తెప్పోత్సవంతో ముగిశాయి. స్వామి, అమ్మవారు తెప్పలపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. మూలవర్లకు ఆలయ ప్రధాన అర్చకులు గంగాధర గురుక్కళ్, దండపాణి గురుక్కల్, విశ్వనాథ గురుక్కల్, అబ్రేశ్వర గురుక్కల్ ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. గ్రామానికి చెందిన గణేష్ బాయ్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎం.బి. విజయకుమార్, ఈవో మునిరాజ, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

పలమనేరు, మార్చి15 : పలమనేరు జవుళివీధిలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఈనెల 16వ తేది జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పలమనేరు కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులకు అదే తుది తీర్పు అని మళ్లీ అప్పీలు పోయే అవకాశం గాని, అప్పీలు పోయే అవసరం గానీ వుండదన్నారు. పోలీసులు, న్యాయవాదులు లోక్ అదాలత్ లో అత్యధిక కేసులు పరిష్కారం కోసం సహకరించాలని కోరారు.

దేవళంపేటలో గజ దాడులు



కల్లూరు, మార్చి 15: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీలో గురువారం రాత్రి పంటపొలాలపై పడి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. మిట్టమీద రాచపల్లికి చెందిన రైతులు కృష్ణారెడ్డి, హేమసుందర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డికి చెందిన వరి, మిరప, డ్రిప్ పైపులను ఏనుగులు ధ్వంసం చేశాయి. కుమ్మపల్లిలోని రైతు కృష్ణయ్యకు చెందిన 20 మామిడిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. దిగుమూర్తివారిపల్లిలోని రైతు పురుషోత్తంకు చెందిన 10 మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. చిన్ననగరిలోని రైతు రెడ్డిప్రసాద్‌కు చెందిన పశుగ్రాసం, జొన్నపంటను ధ్వంసం చేశాయి.

పండ్ల అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మార్చి15: పుంగనూరు ప్రైవేట్ బస్టాండ్ వద్ద వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం పండ్ల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు, మురళీ ఆలయాన్ని శుద్ధి చేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారికి చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి



కల్లూరు, మార్చి 15: అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ షౌకత్ అలి, ఏపీఎం మధు తెలిపారు. పులిచెర్లలో శుక్రవారం ఓటుహక్కుపై డ్వాక్రా మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటుహక్కు చాలా విలువైనదని, దాన్ని దుర్వినియోగం చేసుకోరాదన్నారు. అనంతరం స్త్రీ శక్తి భవనం నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఈ కృష్ణయ్య, సీసీ తేజోవతి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబుతో భవిష్యత్తు భద్రం

కుప్పం, మార్చి 15: చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజల భవిష్యత్తు భద్రమవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలోని ఎన్టీఆర్ కాలనీలో తోటి నాయకులతో కలిసి ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలు ముద్రించిన కరపత్రాలు ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటినుంచి ఆవులపల్లెలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

సోమల,మార్చి15: ఆవులపల్లెలో కొలువుతీరిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి 26వ తేదీ వరకు శ్రీవారి బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. 16వ తేదీ అంకురార్పణ, 17న ధ్వజారోహణం, సూర్యప్రభవాహనం, 18న హనుమంత వాహనం, 19న సింహవాహనం, 20న శేషవాహనం, 21న మోహిని ఉత్సవం, గజవాహనం, 22న కల్యాణోత్సవం, గరుడ సేవ, 23న బ్రహ్మ రథోత్సవం, 24న అశ్వవాహనం, పార్వేటోత్సవం, 25న వసంత్సోవం, హంసవాహనం, 26న శయనోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ, టీటీడీ అధికారులు తెలిపారు.

చిన్నఉప్పరపల్లెలో 263 మందికి చికిత్సలు

సోమల, మార్చి 15: మండలంలోని చిన్నఉప్పరపల్లెలో శుక్రవారం నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో వైద్య బృందం 236 మందికి పలు రకాల పరీక్షలు జరిపారు. ముగ్గురిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పుష్పకుమారి, సోమేశ్వరరెడ్డి, జయసింహ, ప్రదీప్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బైపరెడ్లపల్లెలో వైసీపీ ప్రచారం

రామకుప్పం, మార్చి 15: బైపరెడ్లపల్లెలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం నేతృత్వంలో వైసీపీ నేతలు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థి భరత్‌ను గెలిపించాలని వారు కోరారు. వైసీపీ మండల ప్రచారకార్యదర్శి కేశవరెడ్డి, సర్పంచు ఆనందప్ప తదితరులు పాల్గొన్నారు.

సోమలలో ...

సోమల : మండలంలోని ఏడు పంచాయతీల్లో వైసీపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్‌ఎంపీపీ ప్రభాకర్, పార్టీ నాయకులునాగేశ్వరావు, మోహన్, శీలం భాస్కర్, గంగాధరం, వీవీ రమణ, నాగరాజ, రాజారెడ్డి, నాగభూషణం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సదుంలో ...

సదుం : మండల వైసీపీ శ్రేణులు సదుం బస్టాండు కూడలి నుంచి మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా ఉంచాలి

పాలసముద్రం, మార్చి 15: సచివాలయాల పరిధిలోని వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎంపీడీవో రామనాథ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం 13 పంచాయతీల కార్యదర్శులకు సర్క్యులర్ అందజేశారు. ఎన్నికలు ముగిసేవరకు వలంటీర్లకు ఎలాంటి పనులు చెప్పకూడదని పేర్కొన్నారు.

మరింత సమర్థంగా పనిచేయాలి

- పర్యావరణ కార్యదర్శులతో కమిషనర్

చిత్తూరు, మార్చి 15: శిక్షణ తరగతులను పర్యావరణ కార్యదర్శులు సద్వినియోగం చేసుకుని క్షేత్రస్థాయిలో మరింత సమర్థంగా పనిచేయాలని కమిషనర్ అరుణ చెప్పారు. శుక్రవారం ఏఐఐఎల్ఎస్‌జీ (ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్) ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0లో స్వచ్ఛత మార్గదర్శక్ ప్రోగ్రామ్ శిక్షణ కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య, ఏఐఐఎల్ఎస్‌జీ ప్రతినిధులు కేత్న అతుల్, రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సరస్వతీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



యాదమరి, మార్చి 15: కె.గొల్లపల్లె హైస్కూల్ ఆవరణలో సరస్వతీదేవి విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు కలిసి రూ.1.50 లక్షల వ్యయంతో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హెచ్‌ఎం లలిత, బంగారుపాళ్యం ఎంఈవో రమేష్ బాబు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గోపి, సర్పంచ్ రాధ, ఎంపీటీసీ దుర్వాసులు, టీచర్లు నరసింహారెడ్డి, కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు వితరణ



చిత్తూరు (సెంట్రల్), మార్చి 15: జీజేఎం ట్రస్టు ఛైర్మన్ గురుజాల జగన్మోహన్ సహకారంతో శుక్రవారం పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పరీక్షల ప్యాడ్లు వితరణ చేశారు. టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుతేజ, నాయకులు బాలాజి, తేజ, నాగరాజ్, సందీప్, శశి తదితరులు పాల్గొన్నారు.

చిల్లామాకులపల్లెలో సురక్ష

శ్రీరంగరాజపురం, మార్చి 15: చిల్లామాకులపల్లె గ్రామ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు, ఎంపీడీవో మోహన్ మురళి, తహసీల్దారు, వైద్యులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: ఎంఎం విలాసంలోనూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డీఐవో రవిరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తారు రోడ్డు పనులు ప్రారంభం

వెదురుకుప్పం, మార్చి 15: ఎంపీడీవో కార్యాలయం నుంచి వెదురుకుప్పం గ్రామం వరకు తారు రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈజీఎస్ పథకంలో రూ.39.5లక్షలతో ఈ పనులను ప్రారంభించారు. పంచాయతీరాజ్ ఏఈ మురళి, ఎంపీటీసీ రాధికపురంధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బత్తల చిరంజీవి రెడ్డి, వైసీపీ నేత బట్టే సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన టీచర్‌కి సన్మానం

కార్వేటినగరం, మార్చి 15: కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లె దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదేళ్లపాటు టీచర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన దొరై రాజ్‌ను శుక్రవారం సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం



పూతలపట్టు, మార్చి 15: మండలంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద గల అన్న క్యాంటీన్‌లో శుక్రవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి పేటఅగ్రహారం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు కుటుంబ సభ్యులు భోజనం వితరణ చేశారు. మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, నాయకులు హేమాద్రి, నాగయ్య, భాస్కర్, వీరభద్రయ్య, ఏకాంబరం, దాము, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సీకే బాబుకు భద్రతను పునరుద్ధరించాలి: లావణ్య

చిత్తూరు, మార్చి 15: సీనియర్ రాజకీయ నాయకుడైన సీకే బాబుకు భద్రతను పునరుద్ధరించాలని ఆయన సతీమణి, షిరిడీ విశ్వసాయి చారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ సీకే లావణ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కట్టమంచిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలతో కలిసి ఉమ్మడి అభ్యర్థి విజయానికి సీకేబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఆయనకున్న గన్‌మెన్‌ను తొలగించారని ఆరోపించారు. గతంలో సీకేబాబుపై తొమ్మిదిసార్లు హత్యాప్రయత్నం జరిగిన విషయాన్ని గుర్తు చేసుకుంటే భయమేస్తోందని చెప్పారు. గన్‌మెన్‌ను కొనసాగించకుంటే న్యాయపోరాటం చేస్తానని హెచ్చరించారు.

వర్క్ ఆర్డర్లు నెలాఖరులోపు పూర్తి చేయాలి: ఎస్ఈ



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు రూరల్, మార్చి 15: పెండింగ్ వర్క్ ఆర్డర్లు ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని, లేదంటే సంబంధిత ఏఈలపై చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఎస్ఈ కృష్ణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని స్టోర్స్‌ను, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని పరిశీలించారు. 2019-20 సంవత్సరానికి సంబంధించిన వర్క్ ఆర్డర్లు ఇప్పటికీ పూర్తి చేయకపోవడం సరికాదన్నారు. ఇలాగే వ్యవహరిస్తే ఏఈల జీతాలనుంచి రికవరీ చేస్తామన్నారు. వేసవి దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, మరమ్మతుకు గురవడం జరుగుతుంటాయన్నారు. ఈ కారణంగా వ్యవసాయానికి, గృహాలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని సూచించారు. ఆయనవెంట ఈఈ హరి, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, ఆనంద్ తదితరులున్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందుకు హాజరైన గురజాల

చిత్తూరు సిటీ, మార్చి 15: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. శుక్రవారం నగరంలోని బిలాల్ మసీదులో ముస్లిం సోదరులతో కలసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని మసీదుల అభ్యుద్ధికి కృషిచేస్తానని చెప్పారు. నేతలు జాఫర్, సల్మాన్, గౌస్, యాసిన్, ఇమ్రాన్, హేమాద్రినాయుడు, ఈశ్వర్, గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఛైర్‌పర్సన్‌గా ధనలక్ష్మి



ధనలక్ష్మికి నియామక పత్రం అందజేస్తున్న సాకే శంకర్

తవణంపల్లె, మార్చి 15: కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఛైర్‌పర్సన్‌గా తవణంపల్లె మండలంలోని తొడతరకు చెందిన కాణిపాకం ధనలక్ష్మిని నియమించారు. ఈ మేరకు విజయవాడలోని పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని ఎస్సీ సెల్ రాష్ట్ర ఛైర్మన్ సాకే శంకర్, పీసీసీ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్ అందజేసినట్లు ధనలక్ష్మి శుక్రవారం తెలిపారు.

ఉన్నతస్థాయికి విద్యార్థులు ఎదగాలి

వెదురుకుప్పం, మార్చి 15: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సిద్ధయ్య అన్నారు. శుక్రవారం పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతీ పూజ

కార్వేటినగరం, మార్చి 15: డీఎం పురం జడ్పీ హైస్కూల్లో టెన్త్ విద్యార్థులు సరస్వతీ పూజను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హెచ్‌ఎం సునీత, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన పీడ వైసీపీ

జనసేన ఆత్మీయ సమావేశంలో గురజాల జగన్మోహన్



ర్యాలీగా వెళ్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

చిత్తూరు రూరల్, మార్చి 15: రాష్ట్రానికి పట్టిన పీడ వైసీపీ అని, అది పోవాలంటే అందరూ కలిసికట్టుగా పోరాడాలని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం చిత్తూరు రూరల్ మండలంలోని తొప్పాతిపల్లి పంచాయతీ, జెర్రిమడుగు పంచాయతీలో జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాల మాట్లాడుతూ.. తమ కూటమి విజయం సాధిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ.. మూడు పార్టీలు కలిసినప్పుడే వార్ వన్‌సైడ్ అయిపోయింది. ఇక మెజారిటీపైనే దృష్టి పెట్టాలన్నారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, టీడీపీ నాయకులు హేమలత, సీఆర్ రాజన్, చెన్నకేశవులు నాయుడు, జనసేన నాయకులు చైతన్య, దయారాం, యశ్వంత్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ సర్పంచ్

తొప్పాతిపల్లి పంచాయతీ వైసీపీ సర్పంచ్ మునిరత్నంనాయుడు జనసేనలో చేరారు. ఆయన్ను జనసేన నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థి జగన్మోహన్.. జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు సుమారు 200 వందల కుటుంబాలు జనసేన తీర్థం పుచ్చుకున్నాయి. దీంతో ఈ పంచాయతీలో వైసీపీ దాదాపు ఖాళీ అయినట్లయ్యిందని స్థానిక జనసేన నాయకులు తెలిపారు.

రాష్ట్ర భవిష్యత్ కోసమే మూడు పార్టీల పొత్తు : గాలి భానుప్రకాష్



సమావేశంలో ప్రసంగిస్తున్న గాలి భానుప్రకాష్

నగరి, మార్చి 15: రాష్ట్ర భవిష్యత్ కోసమే తెలుగుదేశం, బీజేపీ, జనసేన పొత్తు పెట్టుకోవడం జరిగిందని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం నగరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. జగన్ అరాచకాలతో రాష్ట్రం విధ్వంసం అయిందన్నారు. అప్పుల ఊబిలో ముంచేశాడని చెప్పారు. సుమారు 30 వేల మంది కల్తీ మద్యం బారినపడి చనిపోయారన్నారు. లా అండ్ ఆర్డర్ నిర్వీర్యం అయిందని విమర్శించారు. టీడీపీ హయాంలో పూర్తి చేసిన ప్రాజెక్టులకు రంగులేసి రిబ్బన్ కటింగ్‌లు చేసుకున్నారని మండిపడ్డారు. ఇవన్నీ చూసే ప్రజలందరూ ఒక తాటిపైకి వచ్చి టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు చినబాబు, శివకుమార్‌రెడ్డి, కె.బాలాజి, రమేష్‌రాజు, గుణశేఖర్, ఇ.ఎన్.శ్రీనివాసన్, జనసేన నాయకులు మెరుపుల మహేష్, దేవ పాల్గొన్నారు.

గ్రాఫిక్స్ అయితే సచివాలయ భవనాన్నెలా తాకట్టు పెట్టారు: థామస్



సమావేశంలో ప్రసంగిస్తున్న థామస్

గంగాధరనెల్లూరు, మార్చి 15: అమరావతిలో చంద్రబాబు గ్రాఫిక్స్‌తో మోసం చేసి ఉంటే.. అప్పులకోసం సచివాలయ భవనాన్ని ఎలా తాకట్టు పెట్టారని సీఎం జగన్‌ను జీడీనెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ప్రశ్నించారు. బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై వింజం, బాలగంగనపల్లె పంచాయతీల్లోని పలుగ్రామాల్లో స్థానిక నేతలతోపాటు నియోజకవర్గ పరిశీలకుడు రవిప్రకాష్, నియోజకవర్గ జనసేన కన్వీనర్ పొన్నా యుగంధర్‌లతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచి పెట్టారు. రాష్ట్రాన్ని అప్పులపాలుచేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కిందని విమర్శించారు. టీడీపీ కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, టీడీపీ మండలాధ్యక్షుడు స్వామిదాస్, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ బాలచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో మీ పాత్ర ప్రత్యేకం

స్పెషల్ పార్టీ పోలీసుల దర్బార్‌లో ఎస్పీ



దర్బార్‌లో మాట్లాడుతున్న ఎస్పీ జాషువా

చిత్తూరు, మార్చి 15: శాంతి భద్రతల పరిరక్షణలో స్పెషల్ పార్టీ పోలీసుల పాత్ర ప్రత్యేకమైందని ఎస్పీ జాషువా అన్నారు. శుక్రవారం సాయుధ దళ కార్యాలయంలో స్పెషల్ పార్టీ పోలీసులకు నిర్వహించిన దర్బార్‌లో ఆయన ప్రసంగించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రోజూ ఉదయం ప్రత్యేక శిక్షణను ఇస్తామన్నారు. దీంతో మరింత సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. త్వరలో స్పెషల్ పార్టీలకు కిట్లను పంపిణీ చేస్తామని, ఉండటానికి ప్రత్యేకమైన బ్యారక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, అడ్మిన్ ఆర్ఐ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంటీవో భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు లోక్ అదాలత్



డీఎల్ఎస్ఏ సెక్రటరీ కరుణకుమార్

చిత్తూరు లీగల్, మార్చి 15: జిల్లా పరిధిలోని పలు కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరగనుందని డీఎల్ఎస్ఏ సెక్రటరీ కరుణకుమార్ తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే లోక్ అదాలత్ ద్వారా జిల్లాలోని 37 బెంచీల ద్వారా 1,500 కేసులు పరిష్కరించేందుకు ముందుగానే గుర్తించడం జరిగిందన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకుని, తమ కేసులను ఉచితంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

డాక్టరేట్ ప్రదానం



రజని

గంగాధరనెల్లూరు, మార్చి 15: తూగుండ్రం గ్రామానికి చెందిన బుక్కాపట్నం రజనీకి అనంతపురం జేఎన్‌టీయూ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈమె కలికిరి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ శశిధర్, ఎస్వీయూ విశ్రాంత ప్రొఫెసర్ ఏవీ నరసింహరావు పర్యవేక్షణలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో స్ట్రెంత్ అండ్ డూరబిలిటీ స్టడీస్ ఆన్ జియోపాలిమర్ అండ్ స్టీల్ ఫైబర్ రైన్‌ఫోర్స్‌డ్ జియోపాలిమర్ కాంక్రీట్ యూసింగ్ ఫ్లైయాష్ అండ్ జీజీబీఎస్‌పై పరిశోధన చేశారు.

సైకో పాలనకు చరమగీతం పాడాలి : అమర్

పెద్దపంజాణి, మార్చి15: రాష్ట్రంలో సైకో పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దపంజాణి మండలం రాయలపేట పంచాయతీలో ఇంటింటికి తెలుగుదేశం, బాబుష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అభివృద్ధిని గాలికొదిలేసి కక్షసాధింపే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు ఆలోచించి ఓటు వేయాలన్నారు. కాగా, వైసీపీకి కంచుకోటగా ఉన్న చెన్నారెడ్డిపల్లెలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు వరదారెడ్డి ఆధ్వర్యంలో గ్రామం మొత్తం మాజీ మంత్రి సమక్షంలో టీడీపీలో చేరారు.



టీడీపీ చేరిన వారితో మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పొంచి ఉన్న ప్రమాదం



మామిడి చెట్ల కొమ్మలకు తగులుతున్న విద్యుత్ తీగలు

విజయపురం, మార్చి 15: మండలంలోని కోసలనగరంలో రామక్కమ్మ ఆలయానికి వెళ్లే మార్గమధ్యంలో తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలు మామిడి కొమ్మలకు తగలడం వల్ల తరచూ చెట్లు కాలిపోతున్నాయని వాపోయారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఎండల తీవ్రతకు ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో భయంగా ఉందని ఇకనైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


దేవళంపేటలో గజ దాడులు



కల్లూరు, మార్చి 15: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీలో గురువారం రాత్రి పంటపొలాలపై పడి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. మిట్టమీద రాచపల్లికి చెందిన రైతులు కృష్ణారెడ్డి, హేమసుందర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డికి చెందిన వరి, మిరప, డ్రిప్ పైపులను ఏనుగులు ధ్వంసం చేశాయి. కుమ్మపల్లిలోని రైతు కృష్ణయ్యకు చెందిన 20 మామిడిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. దిగుమూర్తివారిపల్లిలోని రైతు పురుషోత్తం కు చెందిన 10 మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. చిన్ననగరిలోని రైతు రెడ్డిప్రసాద్‌కు చెందిన పశుగ్రాసం, జొన్నపంటను ధ్వంసం చేశాయి.

అగస్త్యేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం





ధ్వజారోహణం - పంచమూర్తి ఊరేగింపులో ఉత్సవ నిర్వాహకులు - హంసవాహన సేవ

చిత్తూరు కల్చరల్, మార్చి 15: కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయం బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణాన్ని ఆలయ అర్చకుడు శివాచార్య బృందం వైభవంగా నిర్వహించింది. మంగసముద్రం ప్రకాష్‌రెడ్డి, చంద్రకళ దంపతుల ఉభయంతో ఈ కార్యక్రమం జరిగింది. నటరాజ అయ్యర్స్, శంకర బ్రాహ్మణ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పంచమూర్తి ఉత్సవం చేశారు. వీరికి ఆలయ పాలకమండలి ఛైర్మన్ శివప్రసాద్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం కరిణీకర్ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో యాగశాల పూజలు జరిగాయి. తర్వాత స్వామి, అమ్మవార్లకు హంసవాహన సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో తిమ్మారెడ్డి, మల్లికార్జున్ దంపతులు, చాణక్య రవి, విజయలక్ష్మి బాబు, కాళభైరవ ట్రస్టు వెంకటేష్‌తోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం యాళి, సింహ వాహన సేవలు నిర్వహిస్తామని ఈవో తిమ్మారెడ్డి తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



గుడిపాల, మార్చి 15: నిరుపేద కుటుంబాలను ఆదుకోవడమే జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ లక్ష్యమని నిర్వాహకుడు, టీడీపీ సీనియర్ నేత చెన్నకేశవులు నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని చెరువుముందరవూరు గ్రామంలో నిరుపేద అయిన జయలక్ష్మి మృతిచెందడంతో ఆమె కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వసంతాపురంలోని దళితవాడ ప్రజలు వేలాంగనికి వెళ్ళేందుకు ఉచితంగా బస్సును ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు రమేష్ నాయుడు, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయం ప్రారంభం



చిత్తూరు, మార్చి 15: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో పూణేపల్లె వద్ద నిర్మించిన టిడ్కో సముదాయాల్లోని ఇళ్లకు శుక్రవారం గృహ ప్రవేశ కార్యక్రమం జరిగింది. మేయర్ అముద, కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలు లబ్ధిదారులతో కలిసి గృహాలను ప్రారంభించారు. ప్రజా ప్రతినిధులు, టిడ్కో ఈఈ వెంకటముని, ధనంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు గుర్తింపు ఇచ్చింది చంద్రబాబే



పేయనపల్లిలోని మహిళలతో గురజాల ప్రతిమ తదితరులు

గుడిపాల, మార్చి 15: మహిళలకు గుర్తింపు ఇచ్చింది చంద్రబాబు అని గురజాల ప్రతిమ, టీడీపీ నాయకురాలు వైపీ రాజేశ్వరి, మాజీ జడ్పీటీసీ సుమతి అన్నారు. శుక్రవారం చిత్తపార, బండపల్లి, వెప్పాల మానుచేను, శ్రీరంగంపల్లి, పేయనపల్లి, మొగరాలపల్లి, చీలాపల్లి పంచాయతీల్లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, మండల అధ్యక్షురాలు ఉదయ, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మహిళా నేతలు విక్టోరియా, రమేష్, జయచంద్ర, రవి నాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సహకరించండి: తహసీల్దార్

గుడిపాల, మార్చి 15: ఎన్నికల్లో సహకరించాలని రాజకీయ పార్టీల నాయకులను తహసీల్దార్ విజయలక్ష్మి కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఎన్నికల కోడ్, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు రూప్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, టీడీపీ మాజీ ఎంపీటీసీ సాంబశివ నాయుడు, డీటీ కళ్యాణి పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



జయమ్మ

గుడిపాల, మార్చి 15: చిత్తపార గ్రామానికి చెందిన జయమ్మ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు గుడిపాల ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. నాలుగు రోజులుగా కనిపించక పోవడంతో కుటుంబీకులు ఫిర్యాదు చేశారన్నారు.

అంకాల పరమేశ్వరికి శాంతి అభిషేకం



విశేష పుష్పాలంకారంలో అంకాల పరమేశ్వరి అమ్మవారు

చిత్తూరు కల్చరల్, మార్చి 15: గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం శాంతి అభిషేకాన్ని భక్తుల ఉభయంతో అర్చకుడు బీకే కుమార్ నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యుడు కె.ఎం. కుమార్ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ముత్తు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మొగిలీశ్వరుడి బ్రహ్మోత్సవాలు



తెప్పపై విహరిస్తున్న మొగిలీశ్వరుడు

బంగారుపాళ్యం, మార్చి 15: స్వయంభు కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం జరిగిన తెప్పోత్సవంతో ముగిశాయి. స్వామి, అమ్మవారు తెప్పలపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. మూలవర్లకు ఆలయ ప్రధాన అర్చకులు గంగాధర గురుక్కళ్, దండపాణి గురుక్కల్, విశ్వనాథ గురుక్కల్, అబ్రేశ్వర గురుక్కల్ ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. గ్రామానికి చెందిన గణేష్ బాయ్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎం.బి.విజయకుమార్, ఈవో మునిరాజ, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విజయవాడలో చంద్రబాబును కలిసి శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్‌కుమార్
- చిత్తూరు సిటీ



తిరుపతిలో మాజీమంత్రి గల్లా అరుణకుమారిని సన్మానిస్తున్న పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్
- పూతలపట్టు